# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-05-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. భారత్‌లో మొదటిసారిగా జరుగుతున్న వేవ్స్ సదస్సును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ముంబై ప్రారంభిస్తారు.
2. రాబోయే జనాభా లెక్కింపులో కుల గణనను చేర్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.
3. 'ఆంధ్రప్రదేశ్ లోని అన్నివర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అమరావతి నిర్మాణం ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
4. ప్రజా అవసరాల దృష్ట్యా ఆర్టీసీ సమ్మె నిర్ణయంపై పునరాలోచించాలని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.
5. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జిల్లా సింహాచలంలో జరిగిన ప్రమాద ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ కమిషన్ ను ఏర్పాటు చేసింది.
6. ప్రపంచ కార్మిక దినోత్సవం " మే" డేను ఈ రోజు జరుపుకుంటున్నారు.

==========================

భారత్‌లో మొట్ట మొదటిసారిగా జరుగుతున్న వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్టైన్మెంట్ సమ్మిట్ -వేవ్స్ సదస్సును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్లో ప్రారంభిస్తారు. "కనెక్టింగ్ క్రియేటర్స్, కనెక్టింగ్ కంట్రీస్" అనే ఇతివృత్తంతో నాలుగు రోజుల పాటు జరిగే ఈ సదస్సు మీడియా, వినోదం, డిజిటల్ ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా భారత్‌ను నిలపాలని రూపొందించారు. సినిమాలు, ఓటిటి, గేమింగ్, కామిక్స్, డిజిటల్ మీడియా, కృత్రిమ మేధ లాంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను ఈ సదస్సు ఏకీకృతం చేస్తుంది. అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ రోజు కేరళకు వెళ్లి అక్కడ నిర్మించిన విజింజం అంతర్జాతీయ బహుళార్థక ఓడరేవును జాతికి అంకితం చేయనున్నారు.

-------------------------

రాబోయే జనాభా లెక్కింపులో కుల గణనను చేర్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర సమాచార ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాలు, భద్రతా వ్యవహారాలు, రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ సమావేశాలు నిన్న ఢిల్లీలో వరుసగా జరిగాయి. ఈ సమావేశాల్లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ వివరాలను కేంద్ర మంత్రి పాత్రికేయులకు వెల్లడించారు. దేశ సామాజిక నిర్మాణం రాజకీయాల వల్ల ప్రభావితమవకుండా సర్వేలకు బదులుగా కుల గణనను పారదర్శకంగా

జనాభా గణనలో చేర్చాలని అశ్విని వైష్ణవ్ పేర్కొంటూ...

వాయిస్... 31 సెకన్లు

అలాగే షిల్లాంగ్ నుండి సిల్చార్ వరకు 22 వేల 864 కోట్ల రూపాయల వ్యయంతో కొత్త రహదారి, 2025-26 చెరకు సీజన్‌లో రైతులకు క్వింటాలుకు 355 రూపాయల మద్దతు ధర ఇచ్చేలా క్యాబినెట్ ఆమోదించిందని అశ్విని వైష్ణవ్ తెలిపారు.

---------------------------

'ఆంధ్రప్రదేశ్‌లోని అన్నివర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అమరావతి రాజధాని నిర్మాణం ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రేపు జరగనున్న అమరావతి పనుల పునఃప్రారంభానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ మేరకు తెలుగు దేశం పార్టీకి చెందిన నాయకులతో ఆయన నిన్న శ్రవణ మాధ్యమం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. అన్ని ప్రాంతాల అభివృద్ధే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు అమరావతి నిర్మాణం ద్వారా వచ్చే ఆదాయంతో రాష్ట్రంలో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నామని పేర్కొన్నారు. రాజధాని స్వయం ఆధారిత ప్రాజెక్టని వచ్చే మూడేళ్లలో అమరావతిలో మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తామని అన్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్న ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కృష్ణాజిల్లా మచిలీ పట్నంలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, 6000 మంది పోలీసు సాయుధ దళాలతో మూడంచల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. సభ జరిగే ప్రాంతంలో త్రాగునీరు, మజ్జిగ, వంటి ఏర్పాట్లను చేశామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 28 సెకన్లు

---------------------------

ప్రజా అవసరాల దృష్ట్యా ఆర్టీసీ సమ్మె నిర్ణయంపై పునరాలోచించాలని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. హైదరాబాద్‌లో మంత్రి నిన్న మాట్లాడుతూ, నష్టాల్లో ఉన్న తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ టిజియస్‌ఆర్టీసీని లాభాల్లోకి తీసుకొచ్చామని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, ప్రయాణికులకు సౌకర్యం వంటి అంశాలపై కట్టుబడి ఉన్నామని అన్నారు. సమస్యల పరిష్కరానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం జిల్లా సింహాచలంలో గోడ కూలి మరణించిన వారి కుటుంబాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరామర్శించారు. అనంతరం ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈ దురదృష్టకర సంఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం, అందులోనూ ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉండటం అత్యంత బాధాకరమని అన్నారు. లక్షలాది మంది భక్తులు వస్తారని తెలిసినా, ప్రభుత్వం చందనోత్సవానికి కనీస ఏర్పాట్లు చేయడంలో విఫలమైందని తెలుపుతూ,

వాయిస్.. 31 సెకన్లు

---------------------------

సింహాచలంలో జరిగిన ప్రమాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ అధ్యక్షతన ఈ కమిషన్‌ను నియమించింది. ఇందులో సభ్యులుగా సీనియర్ ఐపీఎస్ అధికారి ఆకే రవికృష్ణ, జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వరరావు ఉంటారని పేర్కొంది. అలాగే, ఈ కమిషన్‌కు సివిల్ కోర్టు అధికారాలు కల్పిస్తూ ఈ మేరకు నోటిఫికేషన్ ను జారీ చేసింది.

కాగా శ్రీ వరహా లక్ష్మీనరసింహస్వామి నిజరూపదర్శనానికి వచ్చిన భక్తులపై గోడ కూలడంతో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, ముగ్గురు గాయపడ్డారు.

---------------------------

ఈ రోజు ప్రపంచ కార్మిక దినోత్సవం ..... " మే" డే జరుపుకుంటున్నారు. అమెరికాలోని చికాగో నగరంలో 1886 సంవత్సరంలో జరిగిన కార్మికుల ప్రదర్శన ..... " మే " డే ఆవిర్భావానికి నాంది పలికింది. 1886 మే ఒకటవ తేదీన 8 గంటల పని విధానం కావాలని కోరుతూ......వేలాదిమంది కార్మికులు పోరాటం ప్రారంభించారు. ఈ నినాదానికి మద్దతుగా చికాగొలోనే భారీ ప్రదర్శన జరిగింది. ఇది ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో అనేకమంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ కార్మిక ప్రదర్శనలో మరణించిన వారి స్మృత్యర్థం ప్రతి ఏటా మే ఒకటవ తేదీన కార్మిక దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. కార్మిక దినోత్సవాన్ని భారతదేశంలో అంతరాష్ట్రీయ కార్మిక దివస్ లేదా కాంగర్ దిన్‌గా పిలుస్తారు. మేడే సందర్భంగా పలువురు ప్రముఖులు దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

---------------------------

యాసంగిలో పండించిన వడ్లను రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం 15 వేల కోట్ల రూపాయలను విడుదల చేసిందని పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లో పౌర సరఫరాల కార్యాలయం నుంచి ధాన్యం కొనుగోళ్లపై జిల్లాల కలెక్టర్లతో మంత్రి దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లలో రానున్న 20 రోజులు అత్యంత కీలకమైనవని అన్నారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 8,381 కొనుగోలుకేంద్రాలను ఏర్పాటుచేయడంతోపాటు 13.71 కోట్ల గోనె సంచులు అందుబాటులో ఉంచామని మంత్రి వివరించారు.

---------------------------

తెలంగాణలోని అంగన్వాడీలకు ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించింది. ఈరోజు నుంచి నెల రోజుల పాటు సెలవులు ఇస్తున్నట్లు వెల్లడించింది. వేసవి సెలవుల్లో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు టేక్ హోం రేషన్ ద్వారా గుడ్లు, సరకులు సరఫరా చేయనున్నట్లు తెలిపింది. ఈ సెలవుల్లో అంగన్వాడీ టీచర్లను ఇంటింటి సర్వే వంటి విధులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది.

=====================